నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 29 జనవరి 2025 | HYDERABAD




**ఎంపీ వద్దిరాజు దాతృత్వం**

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ నిధుల నుంచి నిమ్స్ దవాఖానకు ఎలక్ట్రిక్ బగ్గీని బహూకరించి, తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆ బగ్గీకి మంగళవారం జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. ఎంపీ వద్దిరాజు గతంలోనూ రెండు బగ్గీలను ఆస్పత్రికి సమకూర్చారు. ఈ సందర్భంగా ఎంపీని వైద్యులు, సిబ్బంది అభినందించి, సత్కరించారు.



గాజుల రామారంలోని సర్వే నం.329, ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు జేసీబీతో సాయంతో తొలగిస్తున్న దృశ్యం

# ఒక అధికారి.. 4 పోస్టులు

## బల్దియా ఇంజనీరింగ్‌లో గుత్తాధిపత్యం

ఇంజనీరింగ్ విభాగాన్ని గుప్పిట్లోకి తీసుకుని పెత్తనం

సీనియర్లను కాదని కీలక స్థానాలను దక్కించుకున్న వైనం

ఎస్ఈ పోస్టుల భర్తీలో తాత్సారంపై పలు అనుమానాలు

ఉన్నతాధికారి వ్యవహార శైలిపై ఉద్యోగుల్లో తీవ్ర చర్చ

అడ్డదారిలో వచ్చిన అధికారిపై నిరసనకు ఇంజనీర్లు సిద్ధం



సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఒక అధికారి గుత్తాధిపత్యంగా బల్దియాలోని ఇంజనీరింగ్ విభాగంపై పెత్తనం చెలాయిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగంలో అడిగే వాడు లేడు. ఉద్యోగితాస్వామ్యం (హైరార్కీ), ఆపై విధానం తెలిస్తేనే కదా.. ఎవరైనా ప్రశ్నించేది. అలాంటి వ్యవహారం కొనసాగుతున్నా జీహెచ్ఎంసీ పాలనా 'బెల్లం కొట్టిన రాయిలా' కొనసాగుతుంది. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగ ముఖ్య అధికారి వ్యవహార శైలి రోజు రోజుకు వివాదాస్పదమవుతున్నది. కీలక పోస్టులన్నీ తన గుప్పిట్లోకి తీసుకుని ఇష్టారీతిన వ్యవహరిస్తుండటం, ఎస్ఈ (సూపరింటెండెంట్ ఇంజనీరు) పోస్టుల భర్తీలో కాలయాపన చేస్తూ పైరవీలకు తెర లేపారన్న చర్చ ఇంజనీర్లలో మొదలైంది. ఈఎన్సీతో పాటు కీలకమైన రెండు సీఈ పోస్టులు, ఎస్ఈ పోస్టును తన వద్దే ఉంచుకున్న సదరు ఉన్నతాధికారి ఇతర అధికారులకు మాత్రం సరైన పోస్టింగులు లేకుండా చేయడం ఏమిటి? అని ఇంజనీరింగ్ విభాగంలో ఏ ఇద్దరు కలిసినా ఇదే అంశాన్ని చర్చించుకుంటున్నారు. తెలంగాణకు చెందిన వ్యక్తి కాదని, ఐనా ఇక్కడి క్యాడర్‌లో తనకన్నా సీనియర్ అధికారులను కాదని కీలక స్థానాల్లో ఉండి తమపై పెత్తనం ఏమిటి? అని తెలంగాణ ప్రాంత ఇంజనీర్లు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇంజనీరు పెద్ద ఎత్తున నిరసన సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. కమిషనర్‌ను కలిసి ఇంజనీరింగ్ విభాగంలో జరుగుతున్న తంతును వివరించనున్నట్లు ఓ ఇంజనీరు తెలిపారు.

### చర్చనీయాంశంగా విభాగం..

జీహెచ్ఎంసీలో ఉన్న రెండు చీఫ్ ఇంజనీర్లు ఒక సూపరిటెండెంట్ ఇంజనీరు పోస్టును తన వద్ద ఉంచుకున్నారు. చీఫ్ ఇంజనీర్ పోస్టులలో ఒకటి మెయింటనెన్స్ విభాగం, మరొకటి ప్రాజెక్టుల విభాగం. నాలాల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్ఎన్‌డీపీ)లో కూడా ఒక సూపరిటెండెంట్ ఇంజనీరింగ్ పోస్టును తన వద్ద పెట్టుకోవడం ఇప్పుడు పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పై పోస్టుకు వెళ్లిన ఏ అధికారి అయిన తనకు అప్పటి వరకు ఉన్న పోస్టును ఇతరులకు అప్పగించాలి. తద్వారా కొత్త వారికి అవకాశం లభిస్తుంది. ఏ ఉద్యోగి అయినా.., నిత్యం తన పోస్టు మరింత ఉన్నతమైన పోస్టుగా ఉండాలని కోరుకుంటారు. సరిగ్గా అదే కోరుకున్న సదరు అధికారి డిపార్ట్‌మెంట్ హెడ్‌గా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం గమనార్హం. ఇటీవల ఈఈలుగా పదోన్నతి పొంది జీహెచ్ఎంసీలో రిపోర్టు చేసిన వారికి సైతం పోస్టింగులు ఇవ్వలేదని ఇంజనీర్లు మండిపడుతున్నారు.

### పోస్టింగులకు కాలయాపన

జీహెచ్ఎంసీలో ఖాళీగా ఉన్న ఐదు సూపరిటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) పోస్టులకు నలుగురు సీనియర్ ఈఈలకు అడిషనల్ ఛార్జి ఇస్తూ అప్పటి ఈఎన్సీ దేవానంద్ గత డిసెంబర్ రెండో వారంలోనే ప్రతిపాదనలు పంపగా, కమిషనర్ అప్రూవల్ చేయలేదు. తర్వాత ఫైల్ పరిశీలించిన కమిషనర్ మరోసారి పరిశీలించి ఫైల్ పంపించాల్సిందిగా ప్రస్తుత సీఈ భాస్కర్ రెడ్డికి పంపించారు. నెల రోజులు గడుస్తున్నా తమ కింది ఉద్యోగుల పోస్టింగులకు సంబంధించిన ఫైల్‌ను పంపడంలో కాలయాపన చేస్తున్నారని ఇంజనీర్లు వాపోతున్నారు. సదరు అధికారి వ్యవహార శైలిపై ఉద్యోగుల్లో అసహనాన్ని పెంపొందిస్తున్నాయి.

# ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు

## గాజుల రామారం కైసర్‌నగర్‌లో కూల్చివేతలు

దుండిగల్, జనవరి 28: కుత్బుల్లాపూర్ మండలం, గాజుల రామారం రెవెన్యూ పరిధి, కైసర్‌నగర్‌లోని సర్వే నం.329 ప్రభుత్వ భూములల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. సర్వే నం. 329లో గతంలోనే కూల్చివేతలు జరుగగా ఇటీవల కొందరు అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా తిరిగి ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. అంతే కాకుండా అందులో నిర్మాణాలు చేపట్టి అమాయకులకు వాటిని విక్రయిస్తున్నట్లు కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఇన్‌చార్జి తహసీల్దార్ ఆదేశాల మేరకు గిర్దావర్ కలీం, భారీ పోలీసు బందోబస్తు నడుమ జేసీబీలతో కూల్చివేతలు చేపట్టారు. మొత్తం 8 నిర్మాణాలను అధికారులు నేలమట్టం చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా, ఆక్రమించేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.



• నిబంధనల ఉల్లంఘన..

# హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ ఉక్కుపాదం

సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోన్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఉక్కుపాదం మోపుతున్నది. ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్ మార్కెట్లు, ఐస్ క్రీం పార్లర్లు ఇతర వాటిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇందులో భాగంగానే మలక్‌పేటలో సావరియా ఫుడ్ ట్రేడర్స్ అండ్ టిప్ టాప్ ఫుడ్స్, ఎల్లారెడ్డిగూడలోని టేస్టీ స్పైసీ చైనీస్ ఫాస్ట్ ఫుడ్, శ్రీనగర్ కాలనీలో మేఘ కర్రీ పాయింట్, ఉప్పల్‌లోని పిస్తా హౌజ్‌లపై తనిఖీలు చేశారు. అపరిశుభ్ర వాతావరణం, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పదార్థాల తయారీని గుర్తించి సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకున్నట్లు ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తెలిపారు.

# ఆ తీర్పు ప్రభుత్వానికి చెంప పెట్టు

ఇక పట్టణ ప్రాంతవాసులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

ప్రభుత్వ పోకడలో హైకోర్టు తీర్పుపై సర్వత్రా హర్షం

కాంగ్రెస్ హామీల అమలుపై ప్రజల్లో గందరగోళం

ఒక్క హామీ కూడా సరైన విధంగా అమలు కాలేదని ఆగ్రహం

**ఇష్టారాజ్యంగా, అనాలోచితంగా, అమలుకు సాధ్యం కాని 420 హామీలను ప్రజలపై గుప్పించి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సగటు మనిషిని, రైతులను తప్పు దోవ పట్టించేందుకు ప్రయత్నించింది. కాగా, సామాజిక ఉద్యమకారుడు గవినోళ్ల శ్రీనివాస్ నేతృత్వంలో హై కోర్టు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా యంత్రాంగం చెంప చెళ్లుమనిపించింది. ఇష్టవచ్చినట్టు వ్యవహరిస్తే తగదని, అర్హులందరికీ న్యాయం జరగాలని, పథకాలు అందరికీ వర్తించాలని ఆదేశించింది.**

సిటీబ్యూరో/రంగారెడ్డి, జనవరి 28 (నమస్తే తెలంగాణ): '420' హామీలను మేనిఫెస్టోలో అంగరంగ వైభవంగా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ఎగవేసేందుకు నానా అవస్థలు పడుతుంది. అటు ప్రజలు, ఇటు కోర్టులు సర్కారును చెడుగుడాడుతున్నాయి. హామీ అమలు ఇష్టానుసారంగా చేయడం కుదరదని హై కోర్టు మొట్టికాయలు వేసింది. అర్హులందరికీ న్యాయం జరిగేలా పథకాలు ఉండాలని సూచించింది. తాజాగా ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అట్టహాసంగా అమలు చేస్తామని ప్రగల్భాలు పలికి, పట్టణ ప్రాంత కూలీలను మాత్రం పక్కన పెట్టేసే కుట్రలు చేసింది. గ్రామీణ ప్రాంత కూలీలకే ఏడాదికి రూ.12 వేల సాయం అంటూ ఊదరగొట్టింది. ఈ సాయం కూడా అందరికీ చేరలేదు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ ప్రాంత కూలీలకు చేస్తున్న కుట్రను సామాజిక ఉద్యమకారుడు గవినోళ్ల శ్రీనివాస్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. విచారణ జరిపిన హై కోర్టు, మున్సిపాలిటీలోని కూలీలను కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో చేర్చాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఒంటెత్తు పోకడ పోతుందని పట్టణ కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ తీర్పుతో రాష్ట్రంలో 129 మున్సిపాలిటీల్లో సుమారు 8 లక్షల మందికి న్యాయం జరగనుందని పిటిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శివారు గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసి, వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఎగ్గొట్టాలని భావించింది. గ్రామాలను పట్టణాల్లో కలిపి అభివృద్ధి జరుగుతుందంటూ వారిని తప్పుదోవ పట్టించేలా సర్కార్ ధ్వంసరచన చేసింది. కానీ, కాంగ్రెస్ సర్కార్ కుయుక్తులను ప్రజలు తిప్పికొట్టారు. వారి గళం వినిపిస్తూ శ్రీనివాస్ ద్వారా కోర్టుకు వెళ్లారు. హై కోర్టు తీర్పు సానుకూలంగా రావడంతో పట్టణ ప్రాంత కూలీలకు ఆత్మయ భరోసా అమలు చేయక సర్కారుకు తప్పని పరిస్థితి ఏర్పడింది.

### ప్రతిష్ఠాత్మకం.. కాస్త ప్రహసనంగా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమని చెబుకుంటున్న పథకాల పంపిణీ ప్రధానంగా రంగారెడ్డి జిల్లాలో ప్రహసనంగా మారింది. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుని ప్రారంభించిన రేషన్ కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలు ప్రచారానికి తప్పా, ప్రజల దరికి చేరలేదు. జిల్లా వ్యాప్తంగా 21 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని పథకాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పథకాలు వస్తాయని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్లల్లో అసలు పట్టించుకోకపోగా, 21 మండలాల్లో మండలానికో గ్రామం చొప్పున 21 గ్రామాలను ముందుగా ఎంపిక చేసుకున్నారు. ఈ గ్రామాల్లో జనవరి 26 నుంచి అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు అందజేసే కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ, ఇప్పటివరకు గత ప్రభుత్వ హయాంలో ఉన్న రైతు బంధు పథకంలోని రైతులకు మాత్రమే పేరు మార్చి రైతు భరోసాగా నామకరణం చేసి పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో రైతు బంధు కింద ఇచ్చిన సగం మందికి కూడా రైతు భరోసా అందటం లేదు. రైతు భరోసా కింద ఎంపిక చేసిన వారికి కూడా ఇప్పటివరకు పెట్టుబడి సహాయం అందలేదు.




### అంతంత మాత్రం.. ఆత్మీయ భరోసా!

ఆత్మీయ భరోసా పథకం జిల్లాలో అంతంత మాత్రంగానే సాగుతోంది. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉండి, 20 రోజులు పనిచేసిన భూమిలేని రైతు కూలీలకు రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామని, ప్రకటించిన ప్రభుత్వం ఆత్మీయ భరోసా కింద ఈ పథకాన్ని ప్రారంభించింది. కానీ, ఆత్మీయ భరోసాలో ఏ ఒక్కరికి కూడా నగదు సహాయం అందలేదు. అలాగే, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు కూడా ఏ ఒక్కరికి అందిన దాఖలాలు లేవు.

### ఇతర గ్రామాల పరిస్థితి ప్రశ్నార్థకం?!

జిల్లాలోని 21 పైలెట్ గ్రామాల్లో ప్రభుత్వ పథకాల పంపిణీ అస్తవ్యస్తంగా మారిన నేపథ్యంలో మిగిలిన గ్రామాల్లో తమకు వస్తాయా? రావా? అని ప్రజలు అయోమయంలో ఉన్నారు. ఈ యాసంగిలో వ్యవసాయానికి పెట్టుబడి సహాయం అందుతుందని ప్రజలు భావించారు. సంక్రాంతి తర్వాత రైతులందరికి పెట్టుబడి సహాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, వరి నాట్లు పూర్తి కావొస్తున్నప్పటికీ పెట్టుబడి సహాయం కింద రైతు బంధు సహాయం అందటం లేదు. అలాగే, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల ఊసే ఎత్తుటం లేదు. ఈ పరిస్థితిలో ఎవరికి చెప్పాలో తెలియని అయోమయంలో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.

### కూలీలందరికి ఆత్మీయ భరోసా ఇవ్వాల్సిందే..



గ్రామాల్లోని రైతు కూలీలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పిస్తామని ప్రభుత్వం నిర్ణయించడం హాస్యాస్పదం. మున్సిపాలిటీలో ఉన్న రైతు కూలీలకు ఎందుకు పథకం వర్తింపజేయరు? ఈ విషయంపై నేను న్యాయవాది చిక్కుడు ప్రభాకర్‌తో కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశాను. దీనిపై కోర్టు సానుకూలంగా స్పందించింది. కూలీలందరిని ఆత్మీయ భరోసాలోకి తీసుకురావాలని సీఎస్‌కు ఆదేశించింది. నాలుగు వారాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. కూలీలకు అన్యాయం చేయాలని ప్రభుత్వమే భావించడం బాధాకరం. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా పథక రూపకల్పన ఉండాలి. ప్రకటించే ముందరనే నిపుణులతో కసరత్తు చేయాలి. ఇలా స్పష్టత లేకుండా లక్షలాది మంది కూలీలకు అన్యాయం జరిగేలా నిర్ణయాలు ఉండకూడదు.

- గవినోళ్ల శ్రీనివాస్, పిటిషనర్, సామాజిక కార్యకర్త

### పైలెట్ గ్రామాలకే భరోసా.. సిగ్గుచేటు..!



రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం అందరికి అందజేస్తామని ప్రకటించి, కేవలం మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి, పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలకే రైతు భరోసా అందజేయటం సరైన పద్ధతి కాదు. మిగతా గ్రామాల్లో రైతులకు రైతు భరోసా పథకం వర్తింపజేయకుండా, కేవలం పైలెట్ గ్రామాలకే భరోసా అందించటం సిగ్గుచేటు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులందరికీ కాంగ్రెస్ సర్కారు భరోసా వర్తింపజేయాలి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో రైతు బంధు పథకం కింద పెట్టుబడి సహాయం అందజేసి ఆదుకునేది. కాంగ్రెస్ సర్కారు రైతులను నమ్మించి నట్టేటా ముంచుతుంది.

- ఏనుగు బుచ్చిరెడ్డి, తుర్కగూడ, రైతు, ఇబ్రహీంపట్నం రూరల్

### అర్హులైన రైతులందరికీ రైతు భరోసా వర్తించాలి



గత ప్రభుత్వ హయాంలో రైతు బంధు పథకం కింద అందజేసిన పెట్టుబడి సహాయం ఇప్పుడు కూడా అర్హులైన రైతులందరికీ అందజేయాలి. ఎన్నికల ముందు ఎకరాకు ప్రతి ఏటా రూ.15 వేలు అందజేస్తామని చెప్పి అందజేయకపోవటం సిగ్గుచేటు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా.. నేటికీ ఒక్క పంటకు కూడా పెట్టుబడి సహాయం అందించకపోగా, అందరికీ అందజేయాల్సింది పోయి పెట్టుబడి సహాయంలో కోత విధించటం సిగ్గుచేటు. ప్రతి ఒక్కరికి రైతు భరోసా పంట పెట్టుబడి సాయం అందించాలి.

- నిట్టు వీరయ్య, కప్పాడు, రైతు, ఇబ్రహీంపట్నం రూరల్

# ఒకే రోజు ఆరుగురి మృతి

రోడ్డు ప్రమాదాలలో నలుగురు ...,

పడవ ప్రమాదంలో మరో ఇద్దరు ..

మరో ఇద్దరికి గాయాలు

సిటీబ్యూరో, జనవరి 28(నమస్తే తెలంగాణ): మహా నగరంలో మంగళవారం జరిగిన ప్రమాదాలతో ఒక్కసారిగా నగర పౌరులు ఉలిక్కిపడ్డారు. ర్యాష్, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో నలుగురు మృత్యువాత పడగా, ఇద్దరు గాయపడ్డారు. బీజేపీ ఆదివారం సాయంత్రం నిర్వహించిన 'భారతమాతకు హారతి' సందర్భంగా హుస్సేన్ సాగర్‌లో టపాసులు కాల్చుతుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఒకరు దవాఖానాలో చికిత్స పొందుతూ మృతి చెందగా, మరొకరి కోసం హుస్సేన్‌సాగర్‌లో రెండు రోజులుగా గాలింపు చేపట్టడంతో శవమై కనిపించాడు. ఇలా నగరంలో జరిగిన ప్రమాదాలతో యువకులు మృతి చెందడంతో ఆయా కుటుంబాలు శోక సంద్రంలో మునిగిపోయాయి. సోమవారం రాత్రి జగ్నేకి రాత్ సందర్భంగా ప్రార్థనలలో పాల్గొన్న ముగ్గురు మైనర్లు బహదూర్‌పురా, ఆరాంఘర్‌ల మధ్య ఇటీవల ప్రారంభమైన డాక్టర్ మన్‌మోహన్ సింగ్ ఫ్లైఓవర్‌పై డివైడర్‌ను ఢీకొట్టి ప్రమాదానికి గురై మృతి చెందారు. బైక్‌పై తండ్రితో కలిసి స్కూల్‌కు వెళ్తున్న 5వ తరగతి విద్యార్థిని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

### ఒక్కరోజే ఆరుగురు..!

మంగళవారం ఒక్కరోజే నగరంలో ఆరుగురు మృతి చెందారు. రాత్రి వేళల్లో రోడ్లు ఖాళీగా ఉండటంతో మైనర్లు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ట్రిపుల్ రైడింగ్ వెళ్తున్న మైనర్లు వేగంగా వెళ్లడంతో బైక్‌ను అదుపు చేయలేక ప్రమాదానికి గురై ఉంటారని పోలీసులు ఒక అంచనాకు వచ్చారు. ద్విచక్ర వాహనంపై తండ్రితో కలిసి వెళ్తున్న విద్యార్థిని పైకి లారీ దూసుకెళ్లి మృత్యువడిలోకి చేర్చింది. బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నెక్లెస్ రోడ్డులో 'భారత మాతకు హారతి' పేరుతో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం అనంతరం, పడవల్లో క్రాకర్స్ తీసుకొని హుస్సేన్‌సాగర్ మధ్యలోకి వెళ్లి కాల్చుతున్నారు. ఇంతలో నిప్పురవ్వలు ఎగిరి టాపాసులు ఉన్న పడవలో పడటంతో ప్రమాదం జరిగి అక్కడున్న టపాసులు అంటుకున్నాయి. ప్రాణాలు దక్కించుకోవడం కోసం రెండు పడవల్లో ఉన్న వారు హుస్సేన్‌సాగర్‌లో దూకారు. అందులో ఒకరు తీవ్ర గాయాలకు గురై దవాఖానాలో చికిత్స పొందగా, మరొక యువకుడు గల్లంతయ్యాడు, అతని ఆచూకీ కోసం హుస్సేన్‌సాగర్‌లో వెతకడంతో మంగళవారం అతని మృతదేహం బయటపడింది.



నారాయణ గూడ చౌరస్తా, ప్రధాన కూడలిలో జీహెచ్ఎంసీ అధికారులు మంగళ వారం ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తున్న ఫొటో ఫ్రేమ్

# పగలే కాదు.. రాత్రిళ్లూ ట్రాఫిక్ జామ్

రాత్రి 9 గంటలకే సిటీలోకి భారీ వాహనాలు

నిఘా పెట్టి ట్రాఫిక్ రద్దీ లేకుండా చేయాలంటూ ప్రజల విజ్ఞప్తి



సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో పగలే కాదు.. రాత్రి కూడా ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. నగర ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ రద్దీ సమస్య పరిష్కారానికి తూతూ మంత్రంగానే చర్యలు తీసుకుంటున్నారు. రాత్రి వేళల్లో 10 గంటల తరువాతే భారీ వాహనాలకు నగరంలోకి అనుమతి ఉన్నా.. 9 గంటల వరకే సిటీలోకి వచ్చేస్తున్నాయి. దీంతో రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకు నగరంలోని ప్రధాన మార్గాలలో ట్రాఫిక్ రద్దీ భారీగా ఉంటుంది. పొరుగు రాష్ట్రాలకు వెళ్లే ప్రైవేట్ బస్సులతో రోడ్లన్నీ రాత్రి వేళల్లో రద్దీగా ఉంటున్నాయి. అయితే, 10 గంటల తరువాత వీటికి అనుమతు ఉన్నా అంతకు ముందే సిటీలోకి ఎంట్రీ కావడంతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

### స్తంభిస్తున్న రోడ్లు..!

రాత్రి తొమ్మిదయ్యిందంటే చాలు హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కూకట్‌పల్లి నుంచి రాచకొండ కమిషనరేట్ పరిధిలోని హయత్‌నగర్ వరకు ప్రైవేట్ బస్సుల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ క్రమంలోనే ప్రధాన రహదారిపై బారులు తీరి ప్రయాణించే ప్రైవేట్ బస్సులతో ట్రాఫిక్ అంతా రద్దీగా మారుతుంది. ఇష్టానుసారంగా ఎక్కడంటే అక్కడ బస్సులను ఆపేస్తూ రాత్రి వేళల్లో రోడ్లను ప్రైవేట్ వ్యక్తులు స్తంభింపజేస్తుంటారు. ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై ఉండకపోవడంతో ప్రైవేట్ ట్రావెల్స్ ఆగడాలు శృతి మించిపోతుంటాయి. రోడ్లపై మధ్యలోనే బస్సులను ఆపడంతో ఎక్కడి ట్రాఫిక్ అక్కడే జామ్ అవుతుంది. రాత్రి వేళ్లలో సమస్య వస్తే సామాన్య వాహనదారులు ఎవరికి చెప్పుకోలేక గంటల తరబడి రోడ్లపైనే ట్రాఫిక్‌లో చిక్కుకొని అష్టకష్టాలు పడుతుంటారు. ఇక ఖైరతాబాద్ నుంచి అసెంబ్లీ వరకు మార్గమధ్యంలో లక్డీకాపూల్ సిగ్నల్ వద్ద ట్రాఫిక్ లైట్ ఒక్కటే పనిచేస్తుంది. అయితే, ట్రాఫిక్ సిబ్బంది అటూ వైపు కూడా చూడరు. దీంతో అటు బీఎస్ఎన్ఎల్ భవన్ నుంచి ఇటు మెహిదీపట్నం వెళ్లేందుకు వచ్చేవారు, ఖైరతాబాద్, మెహిదీపట్నం వైపు నుంచి అసెంబ్లీ వైపు వెళ్లే వారితో ఈ కూడలి బిజీగా ఉంటుంది. పగలు కాదు, రాత్రి వేళల్లోనూ నగరంలో ట్రాఫిక్ సమస్యలతో సగటు నగర పౌరుడు కొట్టుట్టాడుతున్నాడు. దీనిపై ఉన్నతాధికారులు జోక్యం కలుగ చేసుకొని రాత్రి వేళల్లోనూ ట్రాఫిక్‌ను నిలువరించేందుకు కనీస చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.